క్లుప్తంగా

చెరువు నింపే పనుల ప్రారంభం



చెరువు నింపే పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ వెంకటరమణ

నరసాపురం: పట్టణంలో మున్సిపల్ మంచినీటి చెరువును నింపే పనులను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ ప్రారంభించారు. ప్రధాన పంట కాలువకు నీటిని విడుదల చేయడంతో కాలు వనుంచి మోటార్ల ద్వారా చెరువు లో నీటిని నింపే పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ నరసాపురం పట్టణానికి భారీ విస్తీర్ణంలో చెరువు అందుబాటులోఉంది కాబట్టి 40రోజులకు సరిపడా నీరు నిల్వఉంటుందని చెప్పారు. వేసవిలోకూడా రెండు పూట లా నీరు ఇవ్వగలిగామన్నాను. ఇప్పుడు కాలువ నుంచి మోటార్ల ద్వారా మంచినీటిని చెరువులోకి నింపుతున్నామని చెప్పారు. చెరువు నింపే పనులు త్వరితగతిన పూర్తి చేసి స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వర రావు, మల్లాడి బుజ్జి పాల్గొన్నారు.

నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు నిలిపివేత

పెనుమంట్ర: మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల ద్వారా 4658 మంది రైతుల నుంచి 36422.92 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లులకు రవాణా చేసినట్లు మండల వ్యవసాయ అధికారిణి అడబాల జోషిల మంగళవారం తెలిపారు. మండలంలో 35385 మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యం కాగా లక్ష్యాన్ని అధిగమించి ధాన్యం కొనుగోలు చేసినట్లు ఆమె తెలిపారు. మండలంలో ధాన్యం కొనుగోలు పూర్తయినందున మంగళవారం నుంచి కొనుగోళ్లను నిలిపివేసినట్లు ఆమె తెలిపారు. అలాగే రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆయా గ్రామ రైతులకు విత్తనాలు సరఫరా చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి తెలిపారు. ఎంటీయూ 7029, ఎంటీయూ 1064, ఎంటీయూ 1061, ఎంటీయూ 1318 రకాల వరి విత్తనాలు కావాల్సిన వారు రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు. వారికి కావాల్సిన పై రకాల విత్తనాలను సరఫరా చేస్తామని స్పష్టం చేశారు.

మట్టి తవ్వకాలపై అఖిలపక్ష సమావేశం

యలమంచిలి: చించినాడ పెరుగులంక భూమిలో మట్టి తవ్వకాలపై వివిధ పార్టీల నాయకులు మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. చించినాడ వై జంక్షన్ వద్ద జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ తవ్వకాలు ఆపే వరకు పోరాటం చేస్తామని ప్రకటించారు. అనంతరం పెరుగులంక పరిశీలించడానికి అఖిలపక్ష నాయకులు బయల్దేరగా, వారిని దారిలోనే పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారంతా పోలీసులను తోసుకుంటూ ముందుకు వెళ్లడానికి ప్రయత్నించడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో పోలీసులు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుతో పాటు అఖిలపక్ష నాయకులను, నిరసన కారులను అదుపులోనికి తీసుకుని పరిస్థితిని అదుపులోనికి తీసుకువచ్చారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఉద్యోగ అవకాశాలు



విజయసాయిరెడ్డితో బుడితి సుమన్

నరసాపురం: రాష్ట్రంలో స్కిల్ డెవలఎమెంట్ కార్పొరేషన్ ద్వారా రానున్న రోజుల్లో యువతకు మరింత ఎక్కువగా ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి హామీ ఇచ్చినట్టు పశ్చిమగోదావరిజిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు బుడితి సుమన్ చెప్పారు. సుమన్ మంగళవారం అమరావతిలో విజయసాయిరెడ్డిని కలిసి యువతకు ఉపాధి అవకాశాలపై అంశాన్ని ఆయనకు వివరించారు.

రక్తదాతలే ప్రాణప్రదాతలు

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



పాలకొల్లులో రక్తదానం చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: విద్య, వైద్యం, అన్నధానం వంటివి చేయడానికి లక్షల రూపాయలు విరాళాలుగా ఇచ్చి ప్రోత్సహించే దాతలు అనేక మంది ఉన్నారు. కాని ప్రాణాలను నిలబెట్టే రక్తదాతలు మాత్రం కొందరే ఉంటారు. అన్నదానం కన్నా గొప్పది ప్రాణదానమేనని నేటి యువత బలంగా నమ్ముతున్నారు. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా అత్యదికంగా రక్తదానం చేసిన కొందరు దాతలు వారి అభిప్రాయాలను తెలిపారు. పాలకొల్లు పట్టణంలో 1996 నుంచి తులా రామలింగేశ్వరరావు సారధ్యంలో రక్తదానం చేయడం ప్రారంభించారు. ప్రాణాపాయస్థితిలో ఉన్నామని తమకు సమాచారం అందిన మరుక్షణం వారి వద్దకు వెళ్ళి రక్తం ఇచ్చి రావడం గత 27 సంవత్సరాలు నుంచి అలవాటుగా మార్చుకున్నామని రక్తదాతలు చెబుతున్నారు. అంతేకాదు గత కొంతకాలం నుండి డెంగీ ఫీవర్స్ వల్ల ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గి అనేక మంది ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. అటువంటి వారికి సైతం రక్తదానంతో పాటు ప్లేట్‌లెట్లు, ప్లాస్మా వంటివి కూడా అందిస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు, ప్రసవ సమయంలో, ఆపరేషన్‌ల సమయంలో ఇలా అనేక సందర్భాల్లో వీరికి ఫోన్లు చేస్తుంటారు. ఎక్కడ ఉన్నా అవసరమైతే ఇతర ప్రాంతాలకు వెళ్లి రక్తదానం చేసి వస్తుంటారు. గతంలో రక్తదానం చేసే మనిషి ఎక్కడ ఉన్నాడో వెతికి రక్తం కావాలని అడిగి అతను ఇస్తానంటే సరే లేదంటే మరో వ్యక్తిని వెతుక్కుని తీసుకువెళ్లేవారు. అనంతరం సెల్‌ఫోన్లు రావడంతో నేరుగా రక్తదాతకే ఫోన్‌చేసి చెప్పడంతో ఈ సమస్య కొంతవరకూ తగ్గింది. రాను రాను వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి అధునాతనమైన టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో ఒక గ్రూపు క్రియేట్ చేసుకుని అందులో సమాచారం పెడుతుంటే దాతలు వెంటనే స్పందించి ప్రమాదంలో ఉన్న వ్యక్తులకు రక్తదానం చేసి వస్తున్నారు. తలసేమియా బాధితులకు సైతం రక్తదానం చేస్తున్నారు. రామలింగేశ్వరరావు ఆద్వర్యంలో ఇప్పటివరకూ 23 మెగా రక్తదాన శిబిరాలను నిర్వహించారు.

ఇప్పటికి 54 సార్లు రక్తాన్ని ఇచ్చా



నా బ్లడ్ గ్రూప్ ఓ నెగిటివ్. నేను ఓ డాక్టర్ వద్ద పనిచేస్తున్నాను. గతంలో భీమవరంలో నెలలు కలిగిన చిన్నపిల్లకు 100ఎమ్‌ఎల్ ఓ నెగిటివ్ బడ్ కావలసి అడిగారు. అప్పుడు భీమవరం ఆసుపత్రికి వెళ్లి బ్లడ్ ఇచ్చాను. అప్పటి నుంచినేటికి 54 సార్లు రక్తథానం చేశాను. రక్తం అవసరమైన వారు 90302 58848కు ఫోన్ చేయాలని కోరారు.

– ముచ్చర్ల రామదాసు పాలకొల్లు

22 ఏళ్లుగా రక్తదానం



నేను గత 22 సంవత్సరాలుగా రక్తదానం చేస్తున్నాను. ఒకసారి పాలకొల్లు ప్రైవేటు ఆసుపత్రిలో ఒకామెకు డెలివరి సమయంలో ప్రమాదకరంగా ఉందని ఓ పాజిటివ్ బ్లడ్ కావాలని అడిగారు. చాలా అత్యవసరం అని తనకు సమాచారం అందించారు. దానితో ఆసుపత్రికి వెళ్ళి బ్లడ్ ఇచ్చి వచ్చాను. ఇప్పటికి 36 సార్లు ర క్తదానం చేశాను. రక్తం కావాల్సిన వారు. 90320 39085కు ఫోన్ చేయాలి.

– చీర్ల శివరామ్, పాలకొల్లు

ఎ-నెగెటివ్ రక్తం కావాల్సిన వారు కాల్ చేయండి



నా బ్లడ్ గ్రూప్ ఎ-నెగెటివ్ ఇప్పటికి 30 సార్లు రక్తం ఇచ్చాను. ఒకసారి ప్రాణాపా య స్థితిలో అత్యవసర ఆపరేషన్ చేయాల్సి ఉండగా ఎ నెగెటివ్ బ్లడ్ కావాలని నన్ను అడిగారు. నాది అదే గ్రూపు అని చెప్పి వెళ్లి రక్తం ఇచ్చి వచ్చాను. రక్తం కావాల్సిన వారు 99638 88054కు ఫోన్ చేయాలి.

– జీఎల్వీ ప్రసాద్, పాలకొల్లు

1996 నుంచి రక్తదానం



1996 నుండి రక్తదానం చేయడం ప్రారంభించాం. 98లో చిరంజీవి బ్లడ్‌బ్యాంక్ ప్రారంభించిన తరువాత 240 మంది రక్త దాతలతో టీంగా ఏర్పడ్డాం. ఇప్పటికి 23సార్లు మెగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశాం. మా సభ్యుల్లో 30 నుంచి 56 సార్లు రక్తం ఇచ్చిన దాతలు 60 మంది ఉన్నారు. చిరంజీవి, అల్లు అరవింద్, రామ్‌చరణ్ మరియు రెడ్‌క్రాస్ సొసైటీల చేతులమీదుగా బెస్ట్ బ్లడ్ వలంటీర్‌గా నాలుగుసార్లు సత్కారం అందుకున్నాను.

– తులా రామలింగేశ్వరరావు, పాలకొల్లు

స్నేహితుడి మృతితో రక్తదాతగా



నేను డ్రైవర్‌గా 2009తో హైదరాబాద్‌లో ఉన్న సమయంలో రక్తం దొరకక స్నేహితుడు మృతి చెందాడు. అప్పటి నుండి రక్తం ఇస్తున్నాను. ఇప్పటి వరకు సుమారు 14 సార్లు రక్త దానం, 5 సార్లు ప్లేట్‌లెట్స్ అందించానన్నారు. రక్తం అవసరమైన వారు 96403 14449 నెంబర్‌కు కాల్ చేయాలి.

– తణుకుల రామకృష్ణ, మొగల్తూరు

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని శ్రీనివాసా డీలక్స్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు పట్టణ ఏఎస్సై ఎస్.మార్‌లింగం తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు బ్లూజీన్స్ ఫ్యాంటు, బ్లూ, ఎల్లో టీషర్టు ధరించి ఉన్నాడని, సుమారు 42 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండవచ్చన్నారు. వారం రోజులు క్రితం మృతి చెంది ఉంటాడిన మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్



మొగల్తూరులో విద్యాకానుక కిట్లను అందిసున్న దృశ్యం



జిన్నూరు జెడ్పీహైస్కూల్లో విద్యాకానుక కిట్లు అందిస్తున్న నాయకులు

మొగల్తూరు: ప్రతి విద్యార్థికి విద్యతోనే మంచి భవిష్యత్ ఏర్పడుతుందని జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ తెలిపారు. జగనన్న విద్యా కానుక కిట్లును మంగళవారం స్థానిక పెన్మత్స రంగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని, నాడు-నేడులో పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు,బ్యాగ్, షూస్, సాక్స్, బెల్ట్ అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పడవల మేరీ, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, ప్రధానోపాధ్యాయుడు వర్తమాన రవి శంకర్ సర్కార్, స్కూల్ కమిటీ చైర్మన్ బర్రి వెంకన్న పాల్గొన్నారు.

దిగమర్రులో..

పాలకొల్లు అర్బన్: పేద విద్యార్థులు బాగా చదువుకుని మంచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నారని సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్ అన్నారు. పాలకొల్లు మండలం దిగమర్రు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందజేశారు. 74మంది విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందజేశారు. ఉపసర్పంచ్ కొండేటి మల్లికార్జునరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ లోకేష్, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం కేవీ పద్మావతి, సహోపాధ్యాయులు దాసరి నరసింహరావు, కె వెంకటలక్ష్మి, పీఎంసీ చైర్మన్ ఎన్ సోనీ పాల్గొన్నారు.

పోడూరులో..

పోడూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చెందుతున్నాయని జెడ్పీఫ్లోర్‌లీడర్ గుంటూరి పెద్దిరాజు అన్నారు. జిన్నూరులోని ఏఎస్ఆర్ జెడ్పీహైస్కూలులో మంగళవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జెడ్పీఫ్లోర్‌లీడర్ పెద్దిరాజు మాట్లాడుతూ నాడు-నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ వచ్చిందన్నారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులంతా ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలన్నింటినీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ జమ్ము బుజ్జి, వైఎస్సార్‌సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు బీహెచ్.సూర్పరాజు, హైస్కూలు హెచ్‌ఎం సీహెచ్.శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.అలాగే పెనుమదం జెడ్పీ హైస్కూల్లో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, గ్రామసర్పంచ్ తానేటి బాబూరావు, ఉపసర్పంచ్ పితాని చిన్న, ఎంపీటీసీలు చుట్టుగుల్ల ఆంజనేయులు, మానేపల్లి శ్రీధర్, అప్పన్నచెరువు ప్రాథమిక పాఠశాలలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, సర్పంచ్ బీరా జ్ఞాన కుమారి, గుమ్మలూరు శివారు రావిగొప్పు ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ గొట్టుముక్కల సోనియారమేష్, మండల జేసీఎస్ కన్వీనర్ పైడి ఏసుబాబు, జుత్తుగ సత్యనారాయణ తదితరులు విద్యాకానుక కిట్లను అందించారు.

లక్ష్మణేశ్వరంలో...

నరసాపురం రూరల్: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద విద్యార్థులకోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, గోరుముద్ద వంటి పథకాలను సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలని లక్ష్మణేశ్వరం సర్పంచ్ తిరుమాని వెంకట్రాజు అన్నారు. మంగళవారం నరసాపురం మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలోని దేవునితోట మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన విద్యా కానుక కిట్లను విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కోలపర్తి రామకృష్ణ, దేశింశెట్టి సురేష్, మత్తే సువర్ణరాజు, అల్లు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మొగల్తూరు: రోడ్డుపై పడి గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఎం.వీరబాబు మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం మొగల్తూరు సత్రవుపాలెంకు చెందిన దొంగ సత్యనారాయణ (65) మంగళవారం వేకువజామున ఇదే పంచాయతీ పడమటిపాలెంలోని పొలానికి వెళ్లి తిరిగి మోటార్ సైకిల్‌పై వస్తున్నాడన్నారు. స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలోని జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తూ పడడంతో తలకు తీవ్ర గాయమైందన్నారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు భీమవరం తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉదయం 11 గంటల సమయంలో మృతి చెందాడన్నారు. మృతుని కుమారుడు రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

పాలకొల్లు సెంట్రల్: విద్యుత్ శాఖలో పనిచేసే సిబ్బంది భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని తద్వారా ప్రమాదాలను నివారించవచ్చని నరసాపురం డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీరు బళ్ల సురేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం పాలకొల్లు ఎలక్ట్రిషియన్స్ అసోసియేషన్ భవనంలో విద్యుత్ భద్రతా ప్రమాణాలపై శిక్షణ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈఈ సురేష్‌కుమార్ మాట్లాడుతూ శిరస్త్రాణం, సేఫ్టీబెల్టులు, ఎర్త్ రాడ్స్, గమ్ బూట్స్, రాత్రి వేళల్లో టార్చ్‌లైట్లు తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏపీ చంద్రశేఖర్, రూరల్ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.నాగేశ్వరరావు, పట్టణ ఏఈ ఎస్‌కె బాజ్జీ, పోడూరు ఏఈ ఎల్.శ్రీనివాసరావు, యలమంచిలి ఏఈ డి.రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి

నరసాపురం: సచివాలయ వ్యవస్థ లక్ష్యాలకు తగ్గట్టుగా సిబ్బంది పనిచేయాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. మంగళవారం ముదునూరి పట్టణంలోని 14వవార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ రికార్డులు పరిశీలించారు. సచివాలయానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి, అక్కడందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు, సిబ్బందితో మాట్లాడారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. సచివాలయం బయట కచ్చితంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలు డిస్‌ప్లే బోర్డుల్లో ఉంచాలని చెప్పారు. ఇరుకు గదిలో కార్యాలయం ఉన్న దృష్ట్యా వేరే చోటకు మార్చాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావును ఆదేశించారు.

కాలువ పనుల పరిశీలన

ప్రధాన పంట కాలువ పూడికతీత పనులు ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పరిశీలించారు. కాలువగట్టు వెంబడి ఆక్రమణలు తొలగించాలని చెప్పారు. కాలువగట్టును పూర్తిస్థాయిలో శుభ్రం చేసి గట్టు వెంబడి మొక్కలు పెంచాలని చెప్పారు. కౌన్సిలర్లు వైకేఎస్, సిర్రా కాంతమ్మ, చదలవాడ మెర్లిన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆహ్లాదకరంగా విద్యాబోధన



పెనుమదం పెదపేట లో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు

పోడూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన చేస్తున్నట్లు పాలకొల్లు ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్.ఇందిర అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పెనుమదం పెదపేట అంగన్‌వాడీ కేంద్రంలో జనభాగీదరి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సదస్సు, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఇందిర మాట్లాడుతూ అంగన్‌వాడీ ప్రీస్కూల్లో సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.పద్మావతి, ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణి, అంగన్‌వాడీ టీచర్లు జి.వనజ, ఎం.అమ్మాజీ, ఎస్తేరు, జి.మంగతాయారు, విమల, రత్నకుమారి, బేబీ, స్వర్ణకుమారి, సుజాత, ఎ.పద్మావతి, ఎం.కుమారి తదితరులు పాల్గొన్నారు. మట్టపర్రు గ్రామంలోని మెయిన్‌విలేజ్, పెదపాలెం, ఏఏ పేట, బొల్లేటిగుంట అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్.ఇందిర ఆధ్వర్యంలో జనభగీదరి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గుమ్మలూరు సెక్టార్ సూపర్‌వైజర్ పి.పద్మావతి మెయిన్‌విలేజ్, పెదపాలెం, ఏఏపేట, బొల్లేటిగుంట అంగన్‌వాడీ టీచర్లు ఎ.పద్మావతి, కె.బేబీ, జె.ఎస్తేరురాణి, ఎం.మహాలక్ష్మి, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జనభగీదరీతో చిన్నారుల అభ్యున్నతి

పెనుగొండ: చిన్నారుల అభ్యున్నతికి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయకుమారి అన్నారు. మంగళవారం చెరుకువాడలోని జనగ భగీదరి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. చినమల్లం అంగన్‌వాడీ కేంద్రాల్లో జన భగీరథ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు సిహెచ్ సుబ్రహ్మణ్యం, ఏఎన్‌ఎం రజనీ, మహిళా పోలీసు దివ్య, అంగన్‌వాడీ వర్కర్స్ జి.విజయలక్ష్మి, టి.సీతకుమారి పాల్గొన్నారు.

ప్రతి హామీనీ నిలబెట్టుకుంటున్న సీఎం జగన్



మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుతో కలిసి సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

పెనుగొండ: ప్రజా సంకల్ప యాత్రలోనూ, ఎన్నికల మెనిఫెస్టోలోనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ఆనాడు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడానికి క్యాబినేట్ అంగీకరించినందుకు ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు ఉద్యోగులు సంఘ జిల్లా నాయకులు తూర్పుపాలెంలో కలసి సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బడుగు, బలహీన, దళిత, అగ్రవర్ణ పేదలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చడంతో పాటు, ఉద్యోగులకూ అండగా నిలిచిన ఏకైక సీఎం జగన్ మాత్రమేనన్నారు.

డ్రెయిన్ పనుల పరిశీలన

సిద్ధాంతంలో గరగాలమ్మ డ్రయిన్ ప్రక్షాళన పనులను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు మంగళవారం పరిశీలించారు. ప్రక్షాళన పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చిన్నం ఏడుకొండలు, పార్టీ అధ్యక్షుడు జుత్తిగ దామోదర్, కుడిపూడి రామకృష్ణ, చింతపల్లి ప్రసాద్, వీఆర్వో ఏసుబాబు పాల్గొన్నారు.

చెరువు తవ్వకం పనుల ప్రారంభం

యలమంచిలి: యలమంచిలిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తవ్వుతున్న చెరువు పనులను మంగళవారం ఎంపీపీ రావూరి వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేని రోజుల్లో కూలీలకు పని కల్పించడంలో ఉపాధిహామీ పనులు చక్కగా ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటి చైర్మన్ చివటపు నాగేశ్వరరావు వైఎస్సార్ సీపీ నాయకులు రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, మోకా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.